మాలతి నడుస్తూ నడుస్తూ ఆ యింటి వైపు చూసింది.

కిటికీలోంచి అతను చూసి నవ్వాడు. అతని చల్లని చూపులు, అతని చిరునవ్వు తాలూకు శ్వాసతరంగాలు శశికిరణంలా ఆమె మేనును తాకాయి.

ఆమె బదులుగా చిరునవ్వు నవ్వింది.

"కూరగాయలకా!" అంటూ అడిగాడు అతను, మాలతి చేతిలోని ప్లాస్టిక్ బుట్టకేసి చూస్తూ.

అవునన్నట్లు తల ఊపి ముందుకు కదిలింది మాలతి.



# కిటికీలోని మనిషి

• మల్లిక్

మాలతివాళ్లు ఆ కాలనీకి కొత్తగా వచ్చారు. ఆ కిటికీలోని అబ్బాయితో పరిచయం మాలతికి వారం క్రితం అయ్యింది.

ఆ రోజు సెంటరునుండి కూరగాయలు ఇంటికి తీసుకెళ్తూ ఉంది. సరిగ్గా ఆ యింటిముందుకి వచ్చేసరికి ఆమెకి తనని ఎవరో పిలుస్తున్నట్లు అనిపించి ప్రక్కకి తిరిగి చూసింది.

కిటికీలోంచి ఆ అబ్బాయి పిలుస్తున్నాడు.

"మీ బుట్టలోంచి దోసకాయలు పడిపోయాయ్" అన్నాడు.

ప్లాస్టిక్ బుట్టనిండా కూరగాయలు ఉండడంతో పైన ఉన్న దోసకాయలు రెండు క్రిందికి దొర్లి పడిపోవడం ఆమె గమనించలేదు.

"థాంక్సండీ...." అంది దోసకాయలు బుట్టలో పెట్టుకుంటూ.

అతను చెప్పబట్టి గానీ, ఆ దోసకాయలు పడిపోవడం తను చూసుకోకపోతే ఇంట్లో ఎన్ని చివాట్లు తినిఉండేది!

అమ్మో!....

తలుచుకుని గుండెలమీద చెయ్యి వేసుకుంది.

ఒక్కొక్కప్పుడు అమ్మ తనని తంతుంది కూడా. ఇంట్లో అందరూ తనని అసహ్యించుకుంటారు. పైవాళ్ల సంగతి సరేసరి. కారణం తన రూపం!....




ఈ ప్రపంచంలో తనని అసహ్యించుకోని మనిషి ఒక్కడే— ఆ కిటికీలోని మనిషి. అందుకు నిదర్శనం నిష్కళంకమైన అతని చల్లని చూపులే.

అందరిలా అతను తననెందుకు అసహ్యించుకోడు?....

ఎందుకు??....

ఈ ప్రశ్న ఆమెని వేధించసాగింది. గత రెండురోజులుగా మరీనూ.

వీలుచూసుకుని అడగాలి అనుకుంది.

సెంటరు వచ్చేసింది. మాలతి కూరగాయలు కొనుక్కుని ప్రక్కనే ఉన్న పుస్తకాల షాపువాడి దగ్గర వారపత్రికలు తీసుకుని ఇంటికి బయలుదేరింది.

ఆ యింటి ముందునుండి వెళ్తుండగా అతను కిటికీలోంచి పిలిచాడు.

"కొత్త వారపత్రికాండీ?"

"అవును."

"ఏం తోచడం లేదు— కాస్త ఇస్తారా?.... మళ్లీ మీరు ఈ దారివెంబడి వెళ్తున్నప్పుడు ఇచ్చేస్తాను" అన్నాడు అర్థిస్తున్నట్లు అన్నాడు.

మాలతి కిటికీ దగ్గరికి వెళ్లి పుస్తకాన్ని అతనికి అందించింది.

"థాంక్సండీ..." అన్నాడు పుస్తకాన్ని అందుకుంటూ.

"మిమ్మల్ని ఒక ప్రశ్న అడగనా?"

"ఏమిటి?"

"మీరు నన్ను అసహ్యించుకోవడం లేదా?"

"ఎందుకు?" అతను వింతగా చూశాడు. "మీరు మంచివారులాగానే కనిపిస్తున్నారు నాకు."

"పూర్తిగా బొల్లి సోకి ఎర్రఎర్రగా, నల్లనల్లగా మచ్చలున్న ఈ శరీరాన్ని చూసి.... మా అమ్మా నాన్నే నన్ను అసహ్యించుకుంటారు...."

ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయ్.

"మా యింట్లో నేను పనిమనిషి కన్నా...." ఆమెకు ఇంక మాటలు గొంతునుండి పెగిలి రాలేదు.

కొన్ని క్షణాలు మౌనం అనంతరం అతను అన్నాడు.

"మిమ్మల్ని నేను ఒకటి అడగనా?"

ఆమె ప్రశ్నార్థకంగా చూసింది.

"నేను మిమ్మల్ని పెళ్లిచేసుకోవాలని అనుకుంటున్నాను .... అందుకు మీకేమైనా అభ్యంతరమా?"

ఆమె నమ్మలేనట్లు చూసింది. అతను తనతో వేళాకోళంగానీ ఆడటం లేదు కదా అనిపించింది.

"మిమ్మల్ని చూసి, మీ కష్టాలు గట్టెక్కించడానికీ, మిమ్మల్ని ఉద్ధరించడానికీ నేను త్యాగం చేస్తున్నాననీ, నేనో త్యాగ పురుషుడిననీ, మీరు అనుకోకండి. మీకు ఈ ప్రపంచంలో ఎవరూ ఎలా లేరో నాకూ అంతే. మీకు ఓ తోడు ఎలా అవసరమో నాకూ అంతే...."

మాలతికి అర్థంకాలేదు.

అతని కంటి మూలల్లో చెమ్మ ఏర్పడింది.

"నాకు రెండు కాళ్లూ లేవు.... యాక్సిడెంటులో పోయాయి...."

